

పంట నష్టపోయిన

రైతుల జాబితా సిద్ధం చేయండి

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: మాండూస్ తుపాను ప్రభావంతో జిల్లాలో వరి, వేరుశనగ, చెరకు, ఉద్దులు, పెసలు, మొక్కజొన్న వంటి వ్యవసాయ పంటలకు నష్టం వాటిల్లిందని జిల్లా వ్యవసాయధికారి జె.మురళికష్ణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పంటనష్టం వివరాలు, రైతులతో కూడిన జాబితాను ఆర్‌బికెలలో పొందుపరిచామని, పంట నష్టపోయిన జాబితాలో పేర్లులేని రైతులు వెంటనే వ్యవసాయధికారులు, ఆర్‌బికె సిబ్బందిని సంప్రదించాలని తెలిపారు.


పన్నులు వసూల్..!

- చెత్త తీయాలన్నా.. నీటికైనా డబ్బు చెల్లించాల్సిందే.
- వచ్చే ఏడాదిలో నీటి మీటర్లు
- నగర వాసులకు తప్పని తిప్పలు..

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్:

డబ్బు.. డబ్బు.. డబ్బు.. మనం ఎప్పుడూ ఊహించిఉండం మన ఇంట్లోని చెత్తను వేయడానికి కూడా డబ్బులు చెల్లించాల్సి వస్తోంది. నగరపాలక సంస్థకు చెత్తను తరలించేందుకు నెలకు రూ.70 నుంచి 150లు చెల్లించాల్సి వస్తోంది. సంపాదన ఉన్న వారికి ఇది చాలా తక్కువే కావచ్చు.. కానీ పేద, కార్మిక ప్రజలకు నెలకు రూ.70లు చెత్త తరలింపు కోసం చెల్లించడం కష్టమే. ఒకటో తేదీ వచ్చిందంటే చాలు వాలంటీర్ ఇంటి ముందుకు వచ్చి చెత్తపన్ను చెల్లించల్సి ఉంది. కొన్ని ప్రాంతాల్లో చెత్తపన్ను చెల్లించకుంటే ప్రభుత్వ సంక్షేమ పథకాలు ఆగిపోతాయంటూ బెదింరింపులకు పల్పాడుతున్నట్లు సమాచారం...

చెత్తపన్ను వసూళ్లపై అభ్యంతరాలు వ్యక్తం అవుతున్నా... పైఅధికారులు ఒత్తిడి మేరకు వాలంటీర్లు ప్రతిఇంటికీ తిరిగి వసూలు చేయాల్సి వస్తోందని కొందరు వాలంటీర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మొండిగా చెత్తపన్ను చెల్లించని వారి ఇండ్ల నుంచి చెత్తను తీసుకోవద్దంటూ మున్సిపల్ అధికారులు హుకుం జారీ చేసిన్నట్లు సమాచారం. పై అధికారుల నుండీ ఒత్తిళ్ళ క్షేత్రస్థాయిలో



కైలాసపురం వద్ద నిర్మిస్తున్న భారీ ఓవర్ హెడ్‌ట్యాంకు

చెత్తపన్ను వసూళ్లపై వస్తున్న వ్యతిరేకతతో వాలంటీర్లు తలలు పట్టుకుంటున్నారు.

రాబోయే రోజులు నీటికి డబ్బులే...

రాబోయే రోజుల్లో ప్రతి నీటి బొట్టుకు డబ్బులు చెల్లించక తప్పని పరిస్థితి రానున్నంది. అమృత్ పథకం పేరుతో కండలేరు నుంచి పైపులైన్ ద్వారా నగరపాలక సంస్థ చిత్తూరుకు తాగునీటిని అందిచనున్నారు. ఈ మేరకు పైపులైన్ నిర్మాణం 40శాతం పూర్తిచేశారు. స్థానిక కైలాసపురం వద్ద రూ. 29.20లక్షల వ్యయంతో బారీ ట్యాంకు నిర్మాణానికి చిత్తూరు ఎంఎల్ఏ ఆరణి శ్రీనివాసులు, నగర మేయర్ అముద దాదాపు ఏడు నెలల క్రితం శంకుస్థాపన చేశారు. నాగార్జున ప్రైవెట్ లిమిటెడ్ టెండర్ దక్కించుకొని నిర్మాణ పనులు ప్రారంభించింది. మరో వైపు నగరంలోని రామ్‌నగర్ కాలనీ, మిట్టూరు, బాలాజీ నగర్, గ్రీమ్స్‌పేట, కొంగారెడ్డి వంటి ప్రాంతాల్లో తాగునీటిని అందిచేందుకు జేసిబిల ద్వారా రోడ్లను డ్రిల్‌చేసి పైపులు ఏర్పాటు చేస్తున్నారు. నగరంలోని అన్ని ప్రాంతాలకు పైపులైన్ ఏర్పాటు చేసి కండలేరు నుంచి పైపులైన్ ద్వారా తీసుకొచ్చిన నీటిని కైలాసపురం వద్ద నిర్మాణం అవుతున్న ట్యాంకుల్లో నింపి అక్కడి నుంచి పైపులలైన్ ద్వారా నగరవాసులకు అందించనున్నారు. ఈ ప్రాజెక్టు వచ్చే ఏడాది ఏప్రిల్ నాటికి పూర్తి చేయాలనే లక్ష్యంతో నగర పాలక సంస్థ ఇంజనీరు చెబుతున్నారు. ఈ ప్రాజెక్టు పూర్తిచేసి ఇంటింటికీ కండలేరు నీటిని అందిస్తే నీటి మీటర్లు ఏర్పాటు చేసి నీటి పన్నులు వసూలు చేయనున్నట్లు సమాచారం. ఈ మేరకు నగర పాలక సంస్థ ప్రణాళిక ఇప్పటికే తయారు చేసిన్నట్లు తెలుస్తోంది. నీటి మీటర్లు ఏర్పాటు చేసేందుకు అనుగుణంగా పైపులైన్లుకు మీటర్లు ఏర్పాటు చేసుకొనేలా పైపులు ఏర్పాటు చేశారు. వచ్చే ఏడాది ఏప్రిల్ నుండీ చిత్తూరు నగరవాసులు నీటిపన్ను చెల్లించక తప్పదు. ఒక్కో ఇంటికీ రూ.200 నుంచి 250లు చెల్లించక తప్పదు. ఇప్పటికే చెత్తపన్ను భారంగా మారిన నేపథ్యంలో నీటిపన్ను ఏమిట్రా బాబోయ్ అంటూ నగర వాసులు బెంబేలెత్తిపోతున్నారు.

స్మార్ట్ మీటర్ల పై అసత్య ప్రచారాలు

మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

ప్రజాశక్తి-పుంగనూరు:

స్మార్ట్ మీటర్ల విషయంలో అసత్య ప్రచారాలు చేస్తున్న సంస్థలపై రాష్ట్ర, విద్యుత్, అటవీ, భూగర్భ గనులశాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి మండిపడ్డారు. పుంగనూరు మండలం పల్లెబాట కార్యక్రమాన్ని గురువారం ఎంపీపీ అకిసాని భాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి విలేకరులతో మాట్లాడుతూ స్మార్ట్ మీటర్లు పై కొన్ని పత్రిక యాజమాన్యాలు అసత్య ప్రచారాలు చేస్తూ ప్రజలను తప్పుదారి పట్టిస్తున్నారని అన్నారు. విషప్రచారం చేసేవారు టెండర్లు దాఖలు చేయొచ్చని చురకలు అంటించారు. స్మార్ట్‌మీటర్లలో అనేక సదుపాయాలు ఉండటంతో సాధారణంగానే ధర ఎక్కువగా ఉంటుందన్నారు. వాటిని మామూలు మీటర్లతో పోల్చి ధర ఎక్కువ అని ప్రచారం చేస్తున్నారని, ఏ ఒక్క వ్యక్తిని ఉద్దేశించి ప్రభుత్వం ఇవి మంజూరు చేయలేదు టెండర్లు లేకుండా ఎవరిని పిలిచి పనులు ఇచ్చే పరిస్థితి లేదని స్పష్టం చేశారు. ఎవరైనా కూడా ఈటెండర్లలో పాల్గొనవచ్చు అని చెప్పారు. ప్రస్తుతం ఆర్డిఎస్ఎస్ కింద ప్రభుత్వ కార్యాలయాలు అన్నిటికీ ఈ మీటర్లు బిగిస్తున్నామని తెలిపారు.

కేంద్రం నిర్ణయించిన సూచనల మేరకు ఆ టెండర్లు పిలిచామన్నారు. ఇప్పటికే ఈ కాంట్రాక్ట్ షిర్డీసాయి ఎలక్ట్రికల్ వర్క్స్‌కు అప్పగించామని వార్త రాశారని, అలాంటిది ఎది లేకుండా ఇలాంటి అసత్య వార్తలు రాశారని, త్వరలో రైతులకు ఇచ్చే ఉచిత విద్యుత్‌కు స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేస్తామని తెలిపారు. కేవలం జవాబుదారీతనం తీసుకుని రావడమే దీని ముఖ్య ఉద్దేశ్యమని, వాటికి ఇంకా టెండర్లు పిలవలేదని, త్వరలో టెండర్లు పిలుస్తామని తెలిపారు. నియోజకవర్గంలోని ప్రతిపల్లెలో పర్యటించనున్న రాష్ట్ర విద్యుత్, అటవీ, భూగర్భ గనులశాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ప్రతిపల్లెలో ప్రజలతో మమేకమై వారి సమస్యలు అడిగి తెలుసుకోవడం జరుగుతున్నదన్నారు. తమ దష్టికి వచ్చిన సమస్యలను క్షేత్రస్థాయిలో పరిష్కరించేలా చర్యలు తీసుకుంటున్నారు.

మొదటిరోజు కుమ్మరగుంట, సింగిరిగుంట, మేలుందొడ్డి, వనమలదిన్నె, మాగాండ్లపల్లి పంచాయతీల పరిధిలో పర్యటన నిర్వహించారు.

పుంగనూరు నియోజకవర్గంల పంచాయతీల పరిధిలోని మొత్తం 24 పల్లెల్లో పర్యటించి ప్రజలను నేరుగా కలుసుకుని వారికి ఏమైనా సమస్యలున్నాయా అని అడిగి తెలుసుకున్నారు. ప్రతి గ్రామంలో మంత్రికి ఘన స్వాగతం పలికారు. ఈపర్యటనలో భాగంగా పుంగనూరు నియోజకవర్గం వనమలదిన్నెలోని జెడ్పీ హైస్కూల్‌లో విద్యార్థులకు ట్యాబ్ పంపిణీ చేశారు. అలాగే మండలంలో ఉన్న 17 ఉన్నతపాఠశాలలో 8వ తరగతి చదువుతున్న 1160 మంది విద్యార్థులు, 148 మంది ఉపాధ్యాయులకు ట్యాబులు పంపిణీ చేశారు. అనంతరం మండలంలోని మాగాండ్లపల్లిలో పలు భవనాలను ప్రారంభించారు. మాగాండ్లపల్లిలో రూ.40లక్షలతో నిర్మించిన సచివాలయ భవనం, రూ.17.5లక్షలతో నిర్మించిన విలేజ్ హెల్త్ క్లినిక్, రూ.21.80లక్షలతో నిర్మించిన రైతు భరోసా కేంద్రాలను ప్రారంభించారు. తంబళ్లపల్లి ఎమ్మెల్యే ద్వారకనాథరెడ్డి, జడ్పీ చైర్మన్ వాసు, జడ్పిటిసి సభ్యులు జ్ఞానప్రసూన చంద్రారెడ్డి యాదవ్, ముడా చైర్మన్ వెంకట యాదవ్, రాష్ట్ర సాంస్కృతిక శాఖ విభాగపు చైర్మన్ కొండవీటి నాగభూషణం, ఏఎంసీ చైర్మన్ నాగరాజురెడ్డి పాల్గొన్నారు.



విద్యార్థులకు ట్యాబులు పంపిణీ కార్యక్రమంలో మాట్లాడుతున్న మంత్రి పెద్దిరెడ్డి

జగనన్న కాలనీల్లో మౌలిక వసతులు కల్పించాలి

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్

రాష్ట్ర ప్రభుత్వం నవరత్నాలలో భాగంగా పేదలందరికీ గహ వసతిని కల్పించాలని కార్యక్రమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, నిర్మిస్తున్న కాలనీలలో ఎటువంటి సమస్యలు లేకుండా చూడాలని జాయింట్ కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్ అన్నారు. శుక్రవారం మధ్యాహ్నం జాయింట్‌కలెక్టర్, హౌసింగ్ పిడి పద్మనాభంతో కలిసి వీడియో కాన్ఫరెన్స్‌ను గహనిర్మాణ శాఖ డీఈలు, ఏఈలతో నిర్వహించారు. ఈసందర్భంగా జెసి మాట్లాడుతూ నిర్మిస్తున్న కాలనీలకు సంబంధించి ఎటువంటి సమస్యలు లేకుండా చూడాలని అందులో ప్రధానంగా నీటి సమస్య, అప్రోచ్ రోడ్లు, విద్యుత్ మార్పిడి, గ్రామస్తుల అభ్యంతరాలు, స్థలాల సమస్యలు, భూముల లెవలింగ్ సంబంధించి సమస్యలను పదిరోజులు లోపల పరిష్కరించాలని అన్నారు. ప్రధానంగా గహనిర్మాణాలు వేగంగా జరగాలంటేపై సమస్యలు ఏవి ఉండకూడదని ఇప్పటికే చాలా ప్రాంతాల్లో పరిష్కరించడం జరిగిందని ఇంకా ఏమైనా ఉంటే వాటిని గుర్తించి పరిష్కరించాలని అన్నారు. ఈ సందర్భంగా అధికారులు గుర్తించిన మేరకు నీటి సమస్యలు ఉన్న కాలనీలు 5, అప్రోచ్ రోడ్లు నాలుగు, విద్యుత్ ఫోల్లు ఐదు, గ్రామస్తుల అభ్యంతరాలు మూడు, స్థలాల అభ్యంతరాలు ఆరు, లెవలింగ్‌కు సంబంధించి రెండు చోట్ల సమస్యలు ఉన్నాయని తెలిపారు. జెసి మాట్లాడుతూ వీటిని పది రోజుల్లో పరిష్కరించాలని గహనిర్మాణాలకు ఇటువంటి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు.

నిరాశ్రయులకు దుప్పట్లు పంపిణీ

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్

జిల్లా కేంద్రమైన చిత్తూరు నగరంలోని న్యాకైనికట్టు వీధిలో మెప్మా, నగరపాలక సంస్థ సహకారంతో సపోర్ట్ సంస్థ అధ్యక్షులు పి.జోసఫ్‌రాజు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నిరాశ్రయుల వసతిగహంలో 50మంది నిరాశ్రయులకు ఈఎంసి ఫౌండేషన్, ఆత్మకూరు, నెల్లూరు జిల్లా వారి సౌజన్యంతో దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి చిత్తూరు నగర మేయర్ అముద ముఖ్యఅతిథిగా పాల్గొని నిరాశ్రయులు మధ్య క్రిస్మస్ కేక్ కట్ చేసి దుప్పట్లను పంపిణీ చేశారు. మేయర్ మాట్లాడుతూ క్రిస్మస్ పండుగను నిరాశ్రయులతో కలిసి జరుపుకోవడం చాలా ఆనందంగా ఉందన్నారు. ఈఎంసి ఫౌండేషన్ ద్వారా నిరాశ్రయులకు 100 మందికి దుప్పట్లు ఇవ్వడం చాలా అభినందనీయం అన్నారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ కార్యదర్శి రఘుపతి, సపోర్ట్ సంస్థ నిర్వాహకులు జోసఫ్ రాజు, అడ్వకేట్ స్వప్న, వసతిగహ సిబ్బంది ప్రమీల, శశిరేఖ బాబు, తమిళ్ సెల్వి, నిరాశ్రయులు పాల్గొన్నారు.



నిరాశ్రయులకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న మేయర్ అముద

రీ సర్వే వేగవంతం చేయాలి : తహశీల్దార్

ప్రజాశక్తి- సోమల

మండలంలో రెవెన్యూ గ్రామాల పరిధిలో చేపడుతున్న రీసర్వే కార్యక్రమాన్ని వీఆర్వోలు వేగవంతం చేయాలని తహశీల్దార్ శ్యాం ప్రసాద్‌రెడ్డి కోరారు. తన కార్యాలయంలో వీఆర్వోలతో సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా రీ సర్వే కార్యక్రమాన్ని చేపట్టిందని, దీన్ని రెవెన్యూ సిబ్బంది త్వరితగతిన పూర్తిచేసి ప్రభుత్వ ఆశయాన్ని నెరవేర్చాలని కోరారు. కార్యక్రమంలో డిటి ప్రకాష్ బాబు, వీఆర్వోలు, సర్వేయర్లు పాల్గొన్నారు.



వీఆర్వోలతో సమీక్షిస్తున్న తహశీల్దార్

మెరుగైన విద్యను అందించడానికే ట్యాబుల పంపిణీ


డిప్యూటీ సీఎం కళత్తూరు నారాయణస్వామి



ప్రజాశక్తి -గంగాధర నెల్లూరు: రాష్ట్రంలో విద్యాభివద్ధి కోసం సీఎం జగన్మోహన్ రెడ్డి చేస్తున్న కషి వాటి ఫలితాలు 20ఏళ్ళ తర్వాత కనబడతాయని డిప్యూటీ సీఎం నారాయణస్వామి అన్నారు. గంగాధర నెల్లూరు హైస్కూల్లో 8వ తరగతి విద్యార్థులకు ట్యాబ్‌లను గురువారం పంపిణీ చేశారు. ఈసందర్భంగా డిప్యూటీ సిఎం మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా మరింత మెరుగైనవిద్యను అందించడానికి బైజ్యూస్ కంపెనీతో ఒప్పందం కుదుర్చుకుని 8వతరగతి నుండి విప్లవాత్మక మార్పులు తీసుకురావడానికి రాష్ట్ర ప్రభుత్వం ఎంతో కషి చేస్తున్నదని అన్నారు. ఇతరదేశాల్లో కోవిడ్ మళ్లీ విజంభిస్తుందన్నదని సమాచారం తెలుసుకోవడం జరిగిందని, అందువలన ప్రతిఒక్కరూ మాస్కులు ధరించాలని విన్నవించారు. కార్యక్రమంలో రాష్ట్ర ఆర్టీసీ వైస్‌చైర్మన్ ఎంసి.విజయానందరెడ్డి, పెనుమూరు మార్కెట్ కమిటీ చైర్మన్ కమలాకర్ రెడ్డి, డీఈవో విజయేంద్ర రావు, ఎంపీపీ అనిత, మండల వైసీపీ కన్వీనర్ పూర్ణచంద్రారెడ్డి, ఎంపీడీవో శ్రీదేవి, తాసిల్దార్ ఇన్బనాధన్, ఎంఈఓలు రాజేంద్రన్, రాజేంద్రప్రసాద్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

శాంతిపురం: ప్రతిఒక్క పేద విద్యార్థి ఉన్నత చదువులు చదివి జగనన్న ఆశయాలను నెరవేరాలని జడ్పీటీసీ సభ్యులు శ్రీనివాసులు అన్నారు. బుధవారం మండల పరిధిలోని మట్టం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు బైజూస్ ట్యాబ్‌లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ కోదండరెడ్డి, మండల కన్వీనర్ బుల్లెట్ దండపాని, ఎంపీడీఓ హేమమ్మలిని, ఎంఈఓ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

బైరెడ్డిపల్లి: గురువారం బైరెడ్డిపల్లి జడ్పీ హైస్కూల్‌లో 8వ తరగతి విద్యార్థులకు చిత్తూరు జిల్లా జడ్పీ చైర్మన్ జి.శ్రీనివాసులు (వాసు) , పలమనేరు ఎమ్మెల్యే ఎన్.వెంకటే గౌడ ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న ట్యాబులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపిపి రెడ్డప్ప, జెడ్‌పిటిసి కేశవులు, సర్పంచులు, ఎంపిటిసిలు పాల్గొన్నారు.



బైరెడ్డిపల్లిలో ట్యాబులు పంపిణీ చేస్తున్న జెడ్‌పి చైర్మన్, ఎమ్మెల్యే

అంతరాష్ట్ర దొంగ అరెస్టు

- రూ.11.5 లక్షల విలువ చేసే - బంగారు, వెండి ఆభరణాలు స్వాధీనం

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: ఇటీవల పంజాణి పోలీసుస్టేషన్ పరిధిలో పొలాల దగ్గర ఉన్న ఇంటిలో జరిగిన భారీ దొంగతనం కేసును ప్రతిష్టాత్మకంగా తీసుకున్న పలమనేరు డిఎస్పీ సుధాకర్ రెడ్డి స్వీయ పర్యవేక్షణలో పలమనేరు రూరల్ సిఐ అశోక్ కుమార్ సిబ్బందితో కలిసి ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగా గత 2నెలల నుండి ఈ కేసు గురించి దక్షిణ భారతదేశంలోని దాదాపు అన్ని రాష్ట్రాలలో తిరిగి నేరస్తులకు సంబంధించిన సమాచారం సేకరించడం జరిగింది. ఈక్రమంలో గురువారం ఉదయం 9గంటలకు పోలీసులకు అందిన కచ్చితమైన సమాచారం మేరకు పలమనేరు రూరల్ సిఐ ఆద్వర్యంలో పోలీసుసిబ్బంది పంజాణి మండలం, పలమనేరు - మదనపల్లి రోడ్డులోని, కళ్లుపల్లి క్రాస్ వద్ద ముద్దాయి కె.మురుగన్‌ను అరెస్టు చేశారు. అతని వద్ద నుండి సుమారు 200 గ్రాముల బంగారు ఆభరణాలు, రెండున్న కేజీల వెండి, మొత్తం రూ.11,50,000లక్షల విలువ చేసే క్రైం ప్రాపర్టీని స్వాధీనం చేసుకున్నారు. మురగన్ గత రెండు సంవత్సరాల నుండి దక్షిణ భారతదేశంలోని ఆంధ్ర, తమిళనాడు, కర్నాటక రాష్ట్రాలలోని పొలాల వద్ద ఒంటరి ఇళ్లను లక్ష్యంగా చేసుకొని దొంగతనాలకు పాల్పడి భారీ మొత్తాలను దోచుకుంటూ జల్సా చేస్తూ పోలీసుల కళ్ళు గప్పి తప్పించుకొని తిరుగుతున్నాడు. ఇతనిపై సుమారు నాలుగు రాష్ట్రాల్లో మొత్తంగా 40 కేసులు నమోదై పెండింగ్‌లో ఉన్నాయి. సదరు ముద్దాయి చిత్తూరు జిల్లాలోని రాళ్ళబుదుగురు, బంగారుపాళ్యం, జీడి.నెల్లూరు, పలమనేరు, కుప్పం పోలీసుస్టేషన్ పరిధిలలో దొంగతనాలకు పాల్పడిన్నట్లు జిల్లా ఎస్పి రిషాంత్‌రెడ్డి గురువారం విలేకరుల సమావేశంలో తెలిపారు. తమళనాడు రాష్ట్రం కళ్ళకురుచి తాలూకా తిమ్మలై గ్రామానికి చెందిన మురుగ (37) అంతరాష్ట్ర నేరస్తుడు ఇతడిపై చిత్తూరు జిల్లాలోని పలు పోలీస్ స్టేషన్లలో దొంగతనం కేసులున్నట్లు ఎస్పి తెలిపారు. ఈ కేసును ప్రతిష్టాత్మకంగా తీసుకొని నేరస్తుడిని అరెస్టు చేయడంలో కీలక పాత్ర పోషించిన పోలీసులను అభిందిస్తూ కాష్ రివార్డులను జిల్లా ఎస్పీ అందజేశారు.



అంతరాష్ట్ర నేరస్తుడు మురగ అరెస్టును చూపుతున్న జిల్లా ఎస్పీ

జిల్లాలో14,220 క్లైమ్‌లు పెండింగ్

మూడురోజుల్లో అన్ని క్లైమ్‌లు పరిష్కరిస్తాం : ఆర్‌డిఓ



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న డిఆర్‌ఓ రాజశేఖర్

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: కుప్పం, గంగాధరనెల్లూరు నియోజక వర్గాలలో ఎక్కువగా క్లైమ్‌లు పెండింగ్ ఉన్నాయని, 25వ తేదీ లోపు పూర్తి చేయడం జరుగుతుందని ఎన్నికల ఎన్రోల్‌మెంట్ అధికారి, డిఆర్‌ఒ ఎన్.రాజశేఖర్ అన్నారు. గురువారం మధ్యాహ్నం ఉపఎన్నికల ప్రధానాధికారి వెంకటేశ్వరరావు నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా నుంచి డిఆర్‌ఒ పాల్గొన్నారు. ఈసందర్భంగా డిఆర్‌ఓ మాట్లాడుతూ మొత్తం జిల్లాలో 14,220 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. కుప్పంలో 3,894, పలమనేరులో 1,087, పూతలపట్టు నియోజకవర్గంలో 2,147, చిత్తూరులో 606, గంగాధర నెల్లూరులో 3,063, నగరిలో 2,342, పుంగనూరులో 1,081 ఉన్నాయని వీటిని 25వ తేదీ లోపున పూర్తిచేయడం జరుగుతుందన్నారు. ఫోటో గుర్తింపుకు సంబంధించి 44,913 దరఖాస్తులు ఉన్నాయని వాటిని కూడా 25వ తేదీ లోపున పూర్తి చేస్తామన్నారు. పట్టభద్రుల ఎంఎల్‌సి ఎన్నికలకు సంబంధించి రెండవ విడత 9,523 దరఖాస్తులు వచ్చాయని, 4,040 దరఖాస్తులు పరిష్కరించామని తెలిపారు. 2,810 పరిష్కరించడం జరిగిందన్నారు. అదేవిధంగా టీచర్, ఎంఎల్‌సి స్థానాలకు సంబంధించి 3101మంది దరఖాస్తులు చేసుకోగా మరో 649 పరిశీలించాల్సి ఉందన్నారు. జిల్లా వ్యాప్తంగా ఆధార్ లింకు 82శాతం చేసుకోవడం జరిగిందన్నారు. మిగతా వేగవంతం చేస్తున్నామని ఎన్రోల్మెంట్ అధికారి ఎన్.రాజశేఖర్ ఉపముఖ్య ఎన్నికల అధికారికి తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో ఈ ఎస్‌డిసిలు పర్వీన్, భవాని, ఉమాపతి, మనోజ్‌లు పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

చిత్తూరు జిల్లా ఎమ్మెల్సీ భరత్

ప్రజాశక్తి-రామకుప్పం: మండల పరిధిలోని విజాలాపురం కస్తూరిబా హాస్టల్‌లో విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని చిత్తూరు జిల్లా ఎమ్మెల్సీ భరత్ సూచించారు. గురువారం హాస్టల్లో ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా హాస్టల్లో ఉన్న వసతులను సిబ్బందిని, విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం భోజనాలు పెట్టాలని, నాణ్యత లోపించకుండా వంట తయారు చేయాలని నిర్వాహకులను ఆదేశించారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం భోజనాలకు నిధులు పెంచారన్నారు. 250 మంది విద్యార్థులు చల్లటి నీరుతో స్నానాలు చేయడం ఇబ్బందిగా ఉందని ఎమ్మెల్సీకి తెలియజేశారు. వెంటనే స్పందించి రూ.2.5లక్షలతో ఎమ్మెల్సీ కోటా ద్వారా నిధులను వేడినీటికి సోలార్ సౌకర్యం కల్పిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం ప్రజాప్రతినిధులు హాస్టల్లోనే భోజనం చేసి సంతప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వైసిపి మండలాధ్యక్షులు బాబురెడ్డి, ఎంఈఓ మహబూబ్ బాషా, నేతలు తులసి కుమార్, జనార్దన్ రెడ్డి, హాస్టల్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



నిర్వాహకులతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ భరత్

ప్రజా సమస్యల పరిష్కారానికే గడపగడపకు ప్రభుత్వం కార్యక్రమం

గ్రామాల్లోని ప్రజాసమస్యల పరిష్కారం కోసమే సిఎం జగన్ మోహన్‌రెడ్డి నాయకత్వంలో గడపగడపకు మనప్రభుత్వ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని ఎమ్మెల్సీ భరత్ పేర్కొన్నారు. గురువారం మండల పరిధిలోని 89 పెద్దూరు గ్రామపంచాయతీలో ఇంటిఇంటికీ వెళ్లి సమస్యలు అడిగి తెలుసుకుని పరిష్కరించారు. ప్రభుత్వం ద్వారా వివిధ పథకాలతో ప్రతి కుటుంబానికి లబ్ధి పొందుతున్నారని అన్నారు. పంచాయతీలో తాగునీరు, కాలువలు, రోడ్లు తదితర మౌలిక సదుపాయాలు కల్పించాలని తెలిపారు. అర్హులందరికీ గహాలు మంజురుచేసి నిర్మాణాలను చేపడతామన్నారు. రేషన్ కార్డులు, పెన్షన్, అమ్మఒడి, రైతు భరోసా, భూసమస్యలపై వినతి పత్రాలు అందించారు. వెంటనే సంబంధిత అధికారులతో సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. ఎంపీపీ సుబ్రహ్మణ్యం, జెడ్పిటిసి నితిన్‌రెడ్డి, మండల కన్వీనర్ బాబురెడ్డి, కోకన్వీనర్ చంద్రారెడ్డి, సర్పంచ్ మల్లిక గోవిందప్ప, ప్రచార కార్యదర్శి కేశవరెడ్డి, ఎంపిడిఓ రాధకష్ణ, కార్యకర్తలు ప్రభుత్వ వివిధ శాఖ అధికారులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయదారుల ఆత్మీయ సమ్మేళనం



ప్రజాశక్తి- పలమనేరు: స్థానిక బసవన్న గుడిలో గురువారం జరిగిన ప్రకతి వ్యవసాయదారుల సమావేశంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన రైతులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా వాసు డిపిఎం చిత్తూరు, ప్రకతి వ్యవసాయ ఉద్యమకారులు గంగాధరం, రామమోహన్, స్థానిక ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి చైర్మన్ చెంగారెడ్డి, వ్యవసాయశాఖ అధికారులు అన్నపూర్ణాదేవి సంధ్యారాణి పాల్గొన్నారు. రసాయన రహిత ప్రకతి వ్యవసాయం ఆవశ్యకతను రైతులకు డిపిఎం వాసు వివరించారు. రసాయన వ్యవసాయం వలన నష్టాలను ఆరోగ్యానికి ఏవిధంగా హానికలిగిస్తాయో హాస్పిటల్ చైర్మన్ చెంగారెడ్డి వివరించారు. ప్రకతి వ్యవసాయ ఉత్పత్తులను ఎలా వినియోగదారులకు అందించాలో వ్యవసాయశాఖ అధికారులు వివరించారు. కార్యక్రమాన్ని నిర్వహించిన ప్రకతి వ్యవసాయ రైతులైన చందూల్ కుమార్, ప్రకాష్ రెడ్డి, సుగుణమ్మ గార్లను ప్రత్యేకంగా అభినందించారు

నేడు 'క్రిస్మస్ హైటీ'

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: క్రిస్మస్ పండుగను పురస్కరించుకొని శుక్రవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం సమావేశ మందిరంలో క్రిస్మస్ హైటీ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు గురువారం ఒక ప్రకటనలో జిల్లా మైనార్టీ సంక్షేమశా అధికారి చిన్నారెడ్డి తెలిపారు. జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో నిర్వహించే ఈ కార్యక్రమంలో చర్చి ఉపాసకులు, క్రైస్తవ సోదరీ, సోదరు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

నేటి విద్యార్థులే రేపటి శాస్త్రవేత్తలు


ఘనంగా గణిత దినోత్సవం


చిత్తూరులో..

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: స్థానిక గగనపల్లి క్యాంఫర్డ్ ఇంగ్లీష్ మీడియం పాఠశాల్లో గురువారం ప్రముఖ గణిత శాస్త్రవేత్త శ్రీనివాస రామానుజన్ జన్మదినాన్ని పురస్కరించుకొని విద్యార్థులు గణిత ప్రదర్శనలు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న నల్లంగాడు సంస్కృత పాఠశాల విశ్రాంతి ప్రధానోపాధ్యాయులు రామయ్య విద్యార్థులు తయారు చేసిన గణిత నమూనాలను తిలకించి విద్యార్థులను అభినందించారు. పాఠశాలల అధినేత సిఆర్ మహేష్, డైరెక్టర్లు మేధిని, దీక్ష, హెచ్ఎం సీతాశేఖర్, కోఆర్డినేటర్ హరిప్రియ, దుర్గాదేవి, గణిత ఉపాధ్యాయులు ఫోషన్‌బాబు, జయప్రకాష్‌లు పాల్గొన్నారు.

శాంతిపురం: శ్రీశ్రీ పరమహంస యోగానంద విద్యాలయ సీబీఎస్ఈ పాఠశాలలో జాతీయ గణిత దినోత్సవ కార్యక్రమంలో విద్యాలయ జాయింట్ కరస్పాండెంట్ రాధాకష్ణ, ప్రిన్సిపల్ ఆజాద్ హుస్సేన్ పాల్గొని గణితం గొప్పతనాన్ని విద్యార్థులకు వివరించారు. గణిత ఉపాధ్యాయులు శ్రీనివాస్, మధార్, రాజ్‌కుమార్, భవ్య పాల్గొన్నారు.

చౌడేపల్లె: మండలంలోని శెట్టిపేట పంచాయతీ, మేకలచిన్నేపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు నాగమల్లిక అధ్యక్షతన జాతీయ గణిత దినోత్సవ కార్యక్రమం జరిగింది. పాఠశాల చైర్మన్ మధుసూదన్ రెడ్డి, ఉపాధ్యాయులు దామోదరం, గోవిందు, లింగయ్య, చంద్రశేఖర్, శివరాత్రి వీరభద్రయ్య, బీసాబత్తిని పురుషోత్తం, పాల్గొన్నారు.


చౌడేపల్లెలో..

వెదురుకుప్పం: జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శ్రీనివాస రామానుజన్ జయంతి సందర్భంగా జాతీయ గణిత దినోత్సవాన్ని ప్రధానోపాధ్యాయులు పి.వెంకట రమణారెడ్డి ఆధ్వర్యంలో వేడుకగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పలు పోటీలు నిర్వహించి గెలుపొందిన వారి పారెంట్స్ కమిటీ ఆధ్వర్యంలో బహుమతులు ప్రధానం చేశారు.


వెదురుకుప్పంలో..

కార్వేటినగరం: గణిత మేధావి శ్రీనివాస రామానుజన్ ను ఛాత్రోపాధ్యాయులు ఆదర్శంగా తీసుకోవాలని జిల్లా విద్యాశిక్షణా సంస్థ(డైట్) ఇన్చార్జి ప్రిన్సిపాల్ చెంగల్రాజు అన్నారు. రామానుజన్ చిత్రపటాలను, వివిధ గణిత సూత్రాలను క్షుణ్ణంగా రంగోలిల ద్వారా ప్రదర్శించారు. పోటీలను నిర్వహించి ప్రతిభ చూపిన వారికి బహుమతులను అందించారు.

యాదమరి: కె.గొల్లపల్లె ఉన్నత పాఠశాలలో ఘనంగా గణిత మేళా నిర్వహించారు. ఇందులో 6 నుంచి 10వ తరగతి విద్యార్థులు 55 గణిత వర్కింగ్ మాడల్స్, ప్రాజెక్టులు ప్రదర్శించడం జరిగిందని ప్రధానోపాధ్యాయులు రమేష్‌బాబు తెలిపారు. అనంతరం పలు పోటీల్లో గెలుపొందిన విద్యార్దులకు బహుమతులు ప్రదానం చేశారు.

సోమల: గణిత దినోత్సవం సందర్భంగా మండలంలోని ఉన్నత పాఠశాలలు ప్రాథమికోన్నత పాఠశాలలు


శాంతిపురంలో..

ప్రభుత్వ జూనియర్ కళాశాలలో రామానుజన్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించి ఘనంగా జరుపుకున్నారు. విద్యార్థులు పలు రకాల గణిత సంబంధిత నమూనాల ప్రదర్శనలను నిర్వహించారు.


గంగవరం: మదర్‌థెరిసా విద్యాసంస్థల ఆధ్వర్యంలో ఇంజనీరింగ్ విద్యార్థులు గణిత శాస్త్రపితామహుడు శ్రీనివాస రామానుజన్ జన్మదినం, జాతీయ గణిత దినోత్సవం నిర్వహించినట్లు కళాశాల కరస్పాండెంట్ రవీంద్రబాబు తెలియజేశారు.

కార్వేటినగరం: నేటి విద్యార్థులే రేపటి శాస్త్రవేత్తలని ఎంపీపీ లతాబాలాజీ అన్నారు. గురువారం ఆర్కెఎస్సార్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మండల స్థాయిలో నిర్వహించిన విజ్ఞాన ప్రదర్శనను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ పాఠశాల స్థాయిలోనే విద్యార్థుల ప్రతిభకు పునాదులు పడుతాయన్నారు. విద్యార్థులు ఎప్పటికప్పుడు వర్తమాన అవసరాలను గమనిస్తూ సైన్స్ ప్రయోగాలపై దష్టి సారించాలని తెలిపారు. అనంతరం విజ్ఞాన ప్రదర్శనలో కార్వేటినగరం బాలికల ఉన్నత పాఠశాల, పాదిరికుప్పం, ఆర్కెవీబీపేట, డీఎం పురం, విద్యార్థులు ఏర్పాటు చేసిన ప్రదర్శనలు విజేతలుగా నిలిచారు. వారు జిల్లా స్థాయిలో జరిగే విజ్ఞాన ప్రదర్శనలో


కార్వేటినగరంలో..

పాల్గొంటారని ఆర్కెఎస్సార్ ఉన్నత పాఠశాల హెచ్ఎం వైవీ వసుమతిదేవీ తెలిపారు.

బంగారుపాళ్యం: విద్యార్థులు వైజ్ఞానికంగా అభివద్ధి చెందాలని పూతలపట్టు శాసనసభ్యులు ఎంఎస్ బాబు అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో రాష్ట్ర ప్రభుత్వం అందించిన ట్యాబ్‌ల పంపిణీ కార్యక్రమాన్ని ఎంఈవో నాగేశ్వరరావు ఆధ్వర్యంలో నిర్వహించారు.


బంగారుపాళ్యంలో..

గణిత మేధావి రామానుజన్ మండల విద్యాశాఖ అధికారి నాగేశ్వరరావు అన్నారు. మంగళపల్లి టేకుముంద జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల రామానుజన్ జయంతిని మంగళపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు లలిత ఆధ్వర్యంలో నిర్వహించారు. జనవిజ్ఞాన వేదిక జిల్లా ఉపాధ్యక్షులు, ఆంధ్రప్రదేశ్ మాథ్స్ ఫారం రాష్ట్ర కన్వీనర్ అరుణ శివప్రసాద్, అగస్త్య ఫౌండేషన్ పిఆర్ఓ జయమ్మ పాల్గొన్నారు.

రొంపిచెర్ల: రొంపిచెర్ల క్రాస్ లోగల ప్యూపిల్ సాఫ్ట్ పాఠశాల చైర్మన్ అజుంతుల్లా, ప్రిన్సిపాల్ ప్రతాప్ రెడ్డి ఆధ్వర్యంలో విద్యార్థులు గణితశాస్త్ర నమూనాలను తయారు చేసి పాఠశాలలో ప్రదర్శించారు.

కుప్పం: కుప్పం మండలం గరిగచీనేపల్లి స్థానిక ప్రభుత్వ పాఠశాలలో గణితశాస్త్రం విభాగం అధ్యాపకుల వారి ఆధ్వర్యంలో శ్రీనివాస రామనుజన్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఉపాధ్యాయులు విద్యార్థులు రామానుజన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళు లర్పించారు. ఉత్తమప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు.

జనరల్ న్యూస్

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

ప్రజాశక్తి- రొంపిచెర్ల: రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందిన సంఘటన తిరుపతి- మదనపల్లి జాతీయ రహదారిలోని బందక్రింద పల్లి వద్ద గురువారం రాత్రి జరిగింది. ఏఎస్ఐ మధు కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. బందక్రింద పల్లి దళితవాడకు చెందిన దినేష్ (17) మరో వ్యక్తితో కలిసి ద్విచక్ర వాహనంలో గురువారం రాత్రి 8 గంటలకు పీలేరు వైపు వెళు ండగా పీలేరు నుండి తిరుపతి వైపు వెళుతున్న కారు ఢీకొంది. దీంతో ద్విచక్రవాహనంలోని ఇద్దరు కింద పడ్డారు. ఒకరు రోడ్డు మీద పడటంతో తిరుపతి వైపు నుండి వేగంగా వచ్చి గ్యాస్ లారీ దినేష్ తలపై దూసుకెళ్లింది. దీంతో దినేష్ అక్కడికక్కడే మృతి చెందారు. మరో వ్యక్తికి తీవ్ర గాయాలు అయ్యాయి. దీంతో గాయపడిన యువకుడిని చికిత్స కోసం పీలేరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఏఎస్ఐ మధు సంఘటనా స్థలాన్ని సందర్శించి శవాన్ని పంచనామా కోసం పీలేరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సంఘటన స్థలాన్ని రొంపిచర్ల తహసీల్దార్ మురాషావలి సందర్శించి, వివరాలు అడిగి తెలుసుకున్నారు. బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ తెలిపారు.

బాలికపై అఘాయిత్యానికి పాల్పడిన

వ్యక్తి పై కేసు నమోదు

ప్రజాశక్తి- బంగారు పాల్యం: బాలికపై అఘాయిత్యానికి పాల్పడిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్టు సిఐ నరసింహారెడ్డి తెలిపారు. మండలంలోని టేకుముంద గ్రామానికి చెందిన గుణశేఖర్ అనే వ్యక్తి ఐదు సంవత్సరాల బాలికపై అఘాయిత్యానికి పాల్పడ్డట్టు బాలిక తల్లిదండ్రులు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసినట్టు పోలీసులు తెలిపారు. బాలికను చికిత్స నిమిత్తం చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేపడుతున్నట్టు సిఐ తెలిపారు.

నాటుసారా స్వాధీనం- వ్యక్తి అరెస్టు



ప్రజాశక్తి- సోమల: మండలంలోని తమ్మినాయునిపల్లి పంచాయతీకి చెందిన మేకల సిద్దయ్య (35) అను వ్యక్తి కందూరు పంచాయతీ సామదిగుట్టపల్లి సమీపంలోని వంక వద్ద నాటుసారా అమ్ముతున్నారన్న సమాచారం పోలీసులకు అందింది. దీంతో ఎస్సై లక్ష్మీకాంత్ సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించి సిద్ధయ్య వద్ద నుండి 25 లీటర్ల నాటుసారాన్ని స్వాధీనం చేసుకొని అరెస్టు చేసి రిమాండ్ నిమిత్తం కోర్టుకు తరలించారు.

అంగన్వాడీ పోస్టులకు దరఖాస్తులు

ప్రజాశక్తి- సోమల

మండలంలోని ఒక మెయిన్ అంగన్వాడీ, రెండు మినీఅంగన్వాడీ కేంద్రాలలో అంగన్వాడీ టీచర్ల భర్తీ కోసం నోటిఫికేషన్ విడుదల చేయడం జరిగిందని, అర్హత కలిగిన వారు ఈనెల 27వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని చౌడేపల్లి ఐసిడిఎస్ సిడిపిఓ సరళ దేవి కోరారు. పెద్దఉప్పరపల్లి-1 అంగన్వాడీ కేంద్రంలో అంగన్వాడీ కార్యకర్తగా పని చేస్తున్న ఆమె ఉద్యోగ ఉన్నతిపై వెళ్లడంతో తిరిగి అంగన్వాడీ కార్యకర్త పోస్టు భర్తీ కోసం అర్హులైనవారి నుంచి దరఖాస్తు కోరడం జరుగుతోందన్నారు. అదేవిధంగా భోనమంద, ఫిరంగులగుట్ట మినీ అంగన్వాడీ కేంద్రాలలో అంగన్వాడీ కార్యకర్త పోస్టులు భర్తీ కోసం అర్హులైన వారి నుండి దరఖాస్తు కోరుతున్నామని ఆమె తెలిపారు. మరిన్ని పూర్తివివరాల కోసం చౌడేపల్లి ప్రాజెక్టు ఐసిడిఎస్ కార్యాలయం నందు సంప్రదించవచ్చునని తెలిపారు.

ఓటివారిపల్లిలో నూతన మోటారు ఏర్పాటు

ప్రజాశక్తి- యాదమరి

ఓటివారిపల్లి గ్రామంలో సర్పంచ్ పత్తిపాటి భగవతి ఆధ్వర్యంలో నూతనంగా బోరు మోటారును ఏర్పాటు చేశారు. గురువారం ట్రైనీ కలెక్టర్ మెగస్వరూప్ మోటారు పనులను పర్యవేక్షించారు. తాగునీటి బోరు మోటారు మరమ్మతులకు గురైన నేపథ్యంలో సాధారణ నిధులతో కొత్త మోటారు, పంపుసెట్లు కొనుగోలు చేసి అమర్చడంతో గ్రామంలో నీటి సమస్యను పరిష్కరించారు. ఈ సందర్భంగా ట్రైనీ కలెక్టర్ మాట్లాడుతూ గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కల్పించేందుకు ప్రభుత్వం కషి చేస్తోందన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ఆల్బర్ట్ వెస్లీ, ఇంజినీరింగ్ అసిస్టెంట్ మారెళ్ల వెంకటేష్ పాల్గొన్నారు.

పివి రావుకు ఘన నివాళి

ప్రజాశక్తి- పెద్దపంజాణి: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో దళితుల హక్కుల సాధనకు పోరాటం చేసిన యోధుడు మానవతావాది పివి.రావు అని ఎంపీపీ ఎన్.రెడ్డప్ప అన్నారు. గురువారం పివి రావు వర్ధంతి సందర్భంగా అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి పివి రావుకు నివాళులర్పించారు. ఎంపీపీ మాట్లాడుతూ అంబేద్కర్ రాజ్యాంగం ద్వారా రిజర్వేషన్లను పొందుపరిచిన వాటిని అమలు పరిచేందుకు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో మాల మహానాడు సంఘాన్ని స్థాపించి, మండల స్థాయి వరకు సంఘాలను ఏర్పాటు చేసి దళితుల హక్కుల సాధనకు, రిజర్వేషన్ల అమలుకు పోరాటం చేసిన మహోన్నత వ్యక్తి పివి రావు అని కొనియాడారు. మాలమహానాడు మండల అధ్యక్షులు టిఎం.మంజునాథ్, జిల్లా కార్యదర్శి తిప్పయ్య, ఎంఆర్‌పిఎస్ రాష్ట్ర అధ్యక్షులు సుబ్రహ్మణ్యం, పాపన్న జయప్ప పాల్గొన్నారు.

కీలపట్ల పంచాయతీలో ఎమ్మెల్యే పర్యటన



ప్రజాశక్తి- గంగవరం: మండలంలోని కీళ్లపట్ల పంచాయతీ యానాదికాలనీ, కురపల్లి, మాదిగపల్లి గ్రామాలలో గురువారం గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే వెంకటయ్య గౌడ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన ప్రతి ఇంటి వద్దకు వెళ్లి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అలాగే ప్రభుత్వపథకాలు సక్రమంగా అందుతున్నాయా లేదా అని ఆరా తీశారు. ఎలాంటి సమస్యలు ఉన్న తమ దష్టికి తీసుకొస్తే వెంటనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం కీలపట్ల ఉన్నతపాఠశాలలో 370 మంది విద్యార్థులకు ట్యాబులు పంపిణీ చేశారు.

రాష్ట్ర స్థాయి హ్యాండ్ బాల్ పోటీలకు డీఎంపురం విద్యార్థులు

ప్రజాశక్తి - కార్వేటినగరం:

రాష్ట్ర స్థాయి హ్యాండ్ బాల్ పోటీలకు డీఎంపురం విద్యార్థులు ఎంపికైనట్లు ఆ పాఠశాల హెచ్ఎం నమశ్శివాయ తెలిపారు. గురువారం ఆయన ఎంపికైన విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా హెచ్ఎం మాట్లాడుతూ 21న శ్రీకాళహస్తీ పట్టణంలోని ఎస్వీ డిగ్రీకళాశాలలో నిర్వహించిన అండర్ -17, అండర్ -14 జిల్లా స్థాయిలో నిర్వహించిన హ్యాండ్‌బాల్ పోటీల్లో అండర్ -17 పోటీల్లో భరత్ కుమార్, రితకలు ఎంపికైయ్యారని తెలిపారు. అలాగే అండర్ -14 విభాగంలో బాలాజీ ప్రతిభ చాటుకోవడంతో వారు ఈ నెల 28 నుంచి 30వ తేదీ వరకు సత్యసాయి జిల్లాలోని కదిరి ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలో పాల్గొంటారని హెచ్ఎం పేర్కొన్నారు. అనంతరం విద్యార్థులకు క్రీడల్లో శిక్షణ ఇచ్చిన పీఈటీ తిరుమలరాజును, విద్యార్థులను అభినందించారు.

జాతీయ ఖోఖో పోటీలకు హేమావతి

ప్రజాశక్తి- వీకోట: మండల పరిధిలోని పాముగానిపల్లి ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతన్న విద్యార్థిని సివి.హేమావతి జాతీయస్థాయిలో అండర్-17 విభాగంలో ఖోఖో పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఆర్.రవీంద్రారెడ్డి తెలిపారు. ఈనెల 17, 18, 19వ తేదీల్లో ఈస్టుగోదావరి ఉతుకులూరులో జరిగిన రాష్ట్రస్థాయి ఖోఖో పోటీల్లో చిత్తూరు జిల్లా మూడవస్థానంలో నిలిచింది. ఆ జట్టులో ఉత్తమ ప్రతిభ కనబరిచిన వికోట మండలం పాముగానిపల్లి విద్యార్థిని జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైంది. విద్యార్థికి శిక్షణ ఇచ్చిన పిడి సిఆర్.సురేష్‌బాబును ఉపాధ్యాయులు, సర్పంచ్ సుబ్బారెడ్డి, విద్యార్థుల తల్లిదండ్రులు అభినందించారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన యామిని

ప్రజాశక్తి- యాదమరి: కసిరాల గొల్లపల్లి ఉన్నత పాఠశాల విద్యార్థిని యామిని రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు రమేష్ తెలిపారు. సమస్యలు- వినియోగదారుల కమీషన్‌లో సమర్థవంతమైన పరిష్కారం అను అంశంపై సోమవారం మండల స్థాయిలో, బుధవారం జిల్లా స్థాయిలో వ్యాసరచన, వక్తత్వ పోటీలు నిర్వహించారు. కె.గొల్లపల్లి ఉన్నత పాఠశాలలో పదోతరగతి చదువుతున్న విద్యార్థులు యామిని, ధనుష్య, మాలవిక, స్వర్ణలత ప్రతిభ చూపారు. అలాగే పీసీఆర్ ప్రభుత్వ పాఠశాలలో జరిగిన జిల్లా స్థాయి పోటీలలో కె.యామిని వ్యాసరచన పోటీలో మొదటి స్థానంలో నిలిచినట్లు ప్రధానోపాధ్యాయులు రమేష్‌బాబు తెలిపారు. శుక్రవారం రాష్ట్ర స్థాయిలో అమరావతిలో జరిగే పోటీలో పాల్గొన నున్నట్లు పేర్కొన్నారు. విద్యార్థుల కు శిక్షణ ఇచ్చిన సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయులు మదన్ మోహన్‌రెడ్డి, చిన్నదొరై లను అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మురళీధర్‌రెడ్డి, కనకాచారి, భాస్కర్ రెడ్డి, నర్సింహ రెడ్డి పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు భూమిపూజ

ప్రజాశక్తి- పెద్దపంజాణి: కోగిలేరు గ్రామ పంచాయతీలో గడప గడప మన ప్రభుత్వం (జీజీఎంపీ) ద్వారా మంజూరైన పనులకు గురువారం భూమిపూజ చేసినట్లు సర్పంచ్ రమేష్ బాబు తెలిపారు. సర్పంచ్ మాట్లాడుతూ పంచాయతీఓ ఎమ్మెల్యే వెంకటేగౌడ పర్యటన సందర్భంగా గ్రామాల్లో నెలకొన్న ప్రధాన సమస్యలను ప్రజలు ఎమ్మెల్యేకు నివేదించారు. ఈ మేరకు ఎమ్మెల్యే సహకారంతో గ్రామపంచాయతీలో అభివద్ధి పనుల కొరకు రూ.20లక్షలు నిధులు మంజూరు చేసిందని తెలిపారు. ఎమ్మెల్యే ఆదేశాల మేరకు ఈపనులకు సంబంధించి భూమిపూజ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీటీసీ పరందామ, ఉప సర్పంచ్ ఈశ్వర్, వార్డుసభ్యులు పుణ్యవతి, రత్నమ్మ, శ్రీవాణి, పంచాయతీ కార్యదర్శి గణపతి, ఇంజనీరింగ్ అసిస్టెంట్ వనజ, తదితరులు పాల్గొన్నారు.

రాయితీపై డ్రిప్ పరికరాలు పంపిణీ


బైరెడ్డిపల్లిలో..

ప్రజాశక్తి- రొంపిచెర్ల: ఉద్యానవన పంటలు సాగు చేసి రైతులు అధిక లాభాలు పొందాలని ఎంపీపీ చిచ్చిలి పురుషోత్తం రెడ్డి అన్నారు. గురువారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో 90శాతం సబ్సిడీతో మంజూరైన డ్రిప్ పరికరాలను రైతులకు అందజేశారు. ఈసందర్భంగా ఎంపిపి మాట్లాడుతూ ఉద్యాన వన వ్యవసాయ పంటలు సాగు చేసే రైతుల కోసం ప్రభుత్వం తక్కువ ఖర్చుతో ఎక్కువ ఆదాయం పొందేందుకు డ్రిప్ పరికరాలను మంజూరు చేస్తుందన్నారు. వీటి వలన తక్కువ నీటితో ఎక్కువ వ్యవసాయ పంటలు సాగు చేసి ఎక్కువ ఆదాయం పొందవచ్చన్నారు. అనంతరం నాలుగు లారీల డ్రిప్ పరికరాలను పంపిణీ చేశారు. జెడ్పీటీసీ రెడ్డీశ్వర్ రెడ్డి, మంత్రి పీఏ మునితుకారాం, ఏపీడీ రమణా రెడ్డి, వైస్ ఎంపీపీలు విజయశేఖర్, నూలు రెడ్డెప్ప, ఎంపీడీఓ రాజేంద్ర, తహసీల్దార్ మురాషా వలి, సర్పంచ్‌లు ఇబ్రహీం ఖాన్, నాగిరెడ్డి, పాల్గొన్నారు.

బైరెడ్డిపల్లి: ప్రభుత్వం 90 శాతం రాయితీపై డ్రిప్ పరికరాలను అందిస్తోందని.. రైతులు సద్వినియోగం చేసుకోవాలని లక్కనపల్లి ఆర్‌బీకే అగ్రికల్చర్ అసిస్టెంట్ శేఖర్ అన్నారు. శెట్టిపల్లి గ్రామానికి చెందిన హేమంత్‌రెడ్డికి గురువారం రాయితీ డ్రిప్ పరికరాలను పంపిణీ చేశారు. జైన్ డ్రిప్ ప్రతినిధి లక్ష్మయ్య గౌడు పాల్గొన్నారు.

సచివాలయ సిబ్బంది మెరుగైన సేవలందించాలి

ఎంపీపీ యువరాజ్

ప్రజాశక్తి- వీకోట

మండల పరిధిలోని సచివాలయ సిబ్బంది ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని ఎంపీపీ యువరాజు ఆదేశించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం మండలంలోని వెల్ఫేర్ అసిస్టెంట్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ వెల్ఫేర్ అసిస్టెంట్లు అందరూ సచివాలయంలో ప్రజలకు అందుబాటులో ఉండాలని మధ్యాహ్నం భోజన పథకాన్ని సమర్థవంతంగా తనిఖీలు నిర్వహించి విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందే విధంగా పర్యవేక్షించాలని ఆదేశించారు. పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పన గురించి నివేదికలు పంపించాలన్నారు. సచివాలయంలో అందుబాటులో ఉన్న సేవలను గురించి వాలంటీర్ల ద్వారా ప్రజలకు తెలియజేసి ప్రజాసేవలను పెంచాలని సూచించారు. ప్రతిరోజు సాయంత్రం స్పందన కార్యక్రమాన్ని తప్పనిసరిగా నిర్వహించాలని ఆదేశించారు. ఎంపీడీవో బాలాజీ వెల్ఫేర్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిపి యువరాజ్

సంక్షిప్త వార్తలు

ద్విచక్ర వాహనం వేలం

రొంపిచెర్ల: జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు నాటుసారా అక్రమ రవాణా కేసులో గల యమహా ఫాసినో ద్విచక్ర వాహనాన్ని 23వ తేదీ ఉదయం 9గంటలకు రొంపిచెర్ల పోలీస్‌స్టేషన్‌లో పంచాయతీ దారుణ సమక్షంలో వేలంపాట నిర్వహించనున్నట్లు ఎస్సై శ్రీనివాస్ తెలిపారు. ఈవేలం పాటలో ప్రజలు పాల్గొని ద్విచక్ర ఉన్నన్ని కొనుగోలు చేయవలసిందిగా కోరారు.

రేపే వేలంపాట

విజయపురం: స్థానిక పోలీస్‌స్టేషన్లో శనివారం 24వ తేదీ ఉదయం 11 గంటలకి మోటర్ సైకిల్ వేలం వేస్తున్నట్టు ఎస్సై నరేష్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. వేలంపాట పాడేందుకు ఆసక్తి ఉన్న వారు రూ.2000లు కట్టిన వేలంలో పాల్గొనాలని తెలిపారు.

డీసీసీబీ క్యాలెండర్ల ఆవిష్కరణ

చౌడేపల్లె: జిల్లా సహకార కేంద్ర బ్యాంకు ఎస్సీ, ఎస్టీ, బీసీ ఉద్యోగుల యూనియన్ నూతన సంవత్సరం రాష్ట్ర కార్యవర్గం నూతన క్యాలెండర్‌ను గురువారం స్థానిక సహకార బ్యాంకులో ఆవిష్కరించారు. కార్యక్రమంలో యూనియన్ నాయకుడు రఘుబాబు, చిత్తూరు జిల్లా సహకార కేంద్ర బ్యాంక్ ఛైర్ పర్సన్ రెడ్డెమ్మ, కష్ణమూర్తి, బోర్డు ఆఫ్ డైరెక్టర్స్ హరినాథ్‌రెడ్డి, కరుణాకర్‌చౌదరి, బ్యాంకు సీఈవో మనోహర్ గౌడ్, జనరల్ మేనేజర్ లిల్లీ కేతన్, డీజీఎంలు కె.వి.చలపతి, కిరణ్‌కుమార్, ఏజీఎం సురేష్‌బాబు, యూనియన్ సభ్యులు శశికుమార్, గిరివాని హెడ్ ఆఫీస్ మేనేజర్ ఉషా, మాధవి, భవ్య తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతగా పనిచేయాలి: ఎంపిడిఓ

పాలసముద్రం: గ్రామ సచివాలయ ఉద్యోగులు సమయపాలన పాటించి విధులు నిర్వహించాలని ఎంపీడీవో విద్యావతి తెలిపారు, గురువారం ఆమె బాలకష్ణాపురం, తిరుమలరాజపురం, గ్రామ సచివాలయాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. గ్రామాల్లో మంజూరైన గహ నిర్మాణ పనులు త్వరగా పూర్తిచేయించాలని సూచించారు. కార్యక్రమంలో మండల విస్తరణాధికారి రమేష్, గ్రామ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

బాల్య వివాహాలను నిర్మూలించాలి

పాలసముద్రం: మహిళపై జరుగుతున్న గృహహింస, బాల్య వివాహాల నిర్మూలనకు అందరూ కృషి చేయాలని ఐకెపి ఎపిఎం ఫరీద్ మస్తాన్ పిలుపునిచ్చారు. గురువారం ఐకెబి కార్యాలయంలో డ్వాక్రా సంఘం లీడర్లు, సిసి సంఘమిత్రలకు లింగ వివక్ష మహోత్సవాల్లో భాంగా ర్యాలీ నిర్వహించారు. ఏపీఎం ఫరీద్ మస్తాన్ మాట్లాడుతూ సమాజంలో ఆడ, మగ తేడా లేకుండా అందరూ సమానమని, గహహింస, బాల్యవివాహాలు, లైంగిక దాడులేని సమాజంగా నిర్మూలించాలని తెలిపారు. లింగ వివక్షత లేని సమాజం కోసం ప్రతి ఒక్కరు పని చేయాలని ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ దాము, సిసి చిరంజీవి, లోకనాథం, సంఘమిత్రలు మంజుల, మురుగయ్య, బాలరాజు పాల్గొన్నారు.

ఘనంగా ఎంపీపీ జన్మదిన వేడుకలు



సోమల: మండల ప్రజాపరిషత్ అధ్యక్షులు ఈశ్వరయ్య జన్మదిన వేడుకలను ఘనంగా మండలంలో ఆయన అభిమానులు జరుపుకున్నారు. కందూరు సచివాలయంలో సర్పంచ్ బాష మసూద్ ఆధ్వర్యంలో ఈశ్వరయ్య జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించి కేక్ కట్ చేసి పలువురికి పంచి పెట్టారు. కార్యక్రమంలో మెకానిక్ బాషా, కార్యదర్శి జయశంకర్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

'పార్టీ గెలుపు కోసం పని చేయాలి'

బంగారుపాళ్యం: పార్టీ గెలుపు కోసం పనిచేయాలని ఎన్నారై డాక్టర్ ప్రభుత్వ సలహాదారు వాసుదేవరెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రంలోని జడ్పీ మాజీ చైర్మెన్ కుమార్ రాజాతో కలిసి మాట్లాడారు. రాబోవు ఎన్నికల్లో వైయస్సార్ పార్టీ గెలుపుకు ప్రతి కార్యకర్త పనిచేయాలని, ఆ దిశగా పనులు చేయాలన్నారు. సింగిల్ విండో చైర్మెన్ దత్తాత్రేయ రెడ్డి, ప్రకాష్ రెడ్డి, దిలిప్, జిల్లా సేవాదల్ అధ్యక్షులు కిషోర్ కుమార్‌రెడ్డి, నాగరాజా, దామోదరం పాల్గొన్నారు.

చంద్రబాబు మీటింగ్‌తో

'వైసిపి పెద్దలు బెంబేలు'

గంగాధరనెల్లూరు: రాష్ట్రంలో మాజీ సీఎం చంద్రబాబు నాయుడు పాల్గొంటున్న మీటింగ్‌లకు విశేషమైన ప్రజాధరణ వస్తుండుంటంతో వైసిపి ప్రభుత్వంలోని పెద్దలకు బెంబేలెత్తిపోతున్నారని పాతపాలెం సర్పంచ్ కష్ణనాయుడు, టిడిపి మండల అధ్యక్షుడు స్వామిదాస్, పార్లమెంట్ టిడిపి ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి దేవ సుందరం, మండల టిడిపి బీసీసెల్ అధ్యక్షులు జ్యోతి యాదవ్ అన్నారు. గంగాధర నెల్లూరు మండలం అంబోదరపల్లి పంచాయతీలో గురువారం టిడిపి నాయకులు కార్యకర్తలు కలిసి మన రాష్ట్రానికి ఇదేమి కర్మ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు వెంకటాచలపతి నాయుడు, రామ్మూర్తి నాయుడు, నీరజాక్షులు రెడ్డి, నటరాజ్ మొదలి, నరసింహులు నాయుడు, పద్మనాభరెడ్డి, జగన్నాథరెడ్డి, కండిగ శంకర్, విభూషణ్, ఉలగనాదం, సగి కుమార్, గోపి పాల్గొన్నారు.

వైయస్సార్ సంపూర్ణ పోషణ కిట్లు పంపిణీ

సోమల: మండలంలోని నంజంపేట అంగన్వాడీ కేంద్రంలో సర్పంచ్ వెంకటరెడ్డి ఆధ్వర్యంలో గర్భవతులు, బాలింతలకు వైయస్సార్ సంపూర్ణ పోషణ కిట్లను గురువారం పంపిణీ చేశారు. ప్రభుత్వం గర్భవతులు, బాలింతలు సంపూర్ణ ఆరోగ్యంతో ఉండాలని ఉద్దేశంతో పలు రకాల పౌష్టికాహార పదార్థాలను అంగన్వాడీ కేంద్రాల ద్వారా పంపిణీ చేస్తుందని, వీటిని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకొని సంపూర్ణ ఆరోగ్యంతో ఉండాలని కోరారు.

కనకదాసు 535 జయంతి ముగింపు ఉత్సవాల

పోస్టర్ ఆవిష్కరణ

రొంపిచెర్ల: కనకదాసు 535వ జయంతి ముగింపు ఉత్సవాలను విజయవంతం చేయాలని రాష్ట్ర కురబ సంఘం అధ్యక్షుడు జబ్బాల శ్రీనివాసులు పిలుపునిచ్చారు. ఆయన గురువారం రొంపిచెర్లలో జయంతి ఉత్సవాల పోస్టర్లను విడుదల చేశారు. వారు మాట్లాడుతూ ఈనెల 27న కురబలకోటలో ఉత్సవాలను నిర్వహిస్తున్నామని తెలిపారు. కురబలు ఐకమత్యంగా ఉండి ముందుకు సాగాలన్నారు. కురబలను ఆదుకునే పార్టీలకు మన మద్దతు ఇవ్వాలని తెలిపారు. షణ్ముగం, రెడ్డిసుధాకర్, కోదండపాణి, కోటా వెంకటరమణ, మెకానిక్ రమణ పాల్గొన్నారు.

గర్భిణులు, చిన్నారులకు వైద్యపరీక్షలు

బైరెడ్డిపల్లి : స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ విజయ్ చంద్ర ఆధ్వర్యంలో జాలరిపల్లిలో వైఎస్సార్ ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణులు, చిన్నపిల్లలకు వైద్యపరీక్షలు నిర్వహించారు. హెల్త్ ఎడ్యుకేటర్ పి.సావిత్రి గర్భిణులకు తీసుకోవల్సిన ఆహారం, జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. సీజన్ వ్యాధులు రాకుండా తగిన జాగ్రత్తలు పాటించాలని సూచించారు. అలాగే విఫ్స్ ప్రోగ్రామ్స్ సందర్భంగా రక్తహీనత నివారణకి ప్రాథమిక పాఠశాలలోని విద్యార్థులకు మాత్రలు మిగించి పోషకాహారం, చేతులు, వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. సిబ్బంది జ్యోత్స్న, ఎర్రంరెడ్డి పద్మ, అమరమ్మ పాల్గొన్నారు.